క్లుప్తంగా

మోదీ లైవ్ షోను వీక్షించిన చైర్‌పర్సన్



మోదీ లైవ్ షోను చూస్తున్న చైర్‌పర్సన్ దుర్గారాణి, కౌన్సిలర్లు

మండపేట: ఒడిశాలోని భువనేశ్వర్ వేదికగా చేపట్టిన ప్రధానమంత్రి ఆవాస్ యోజన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి లైవ్ షో ద్వారా వీక్షించారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో అధికారుల సమక్షంలో కమిషనర్ చాంబర్‌లో ఈ షో ఏర్పాటు చేశారు. చైర్‌పర్సన్ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, నీలం దుర్గమ్మ, కార్యాలయ అధికారులు ఈ షోను తిలకించారు. ఈ పథకం ప్రారంభోత్సవం అనంతరం మోదీ ప్రసంగాన్ని ఆసక్తి చూశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కమిషనర్ టి. కనకరాజు, టిడ్కో టీఎల్‌టీసీ బిందు, టిడ్కో ఏఈ వివేక్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర పురుషుల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పతకాల వర్షం



రెండు గోల్డ్ మెడల్స్ సాధించిన ద్రాక్షారామకు చెందిన డీఆర్‌కే

రామచంద్రపురం రూరల్: జిల్లా కేంద్రం అమలాపురంలోని ఆఫీసర్స్ రిక్రియేషన్ క్లబ్‌లో నిర్వహించిన 11వ రాష్ట్రస్థాయి పురుషుల పవర్ లిఫ్టింగ్ పోటీల్లో మండలానికి పలువురు పతకాలు సాధించారు. ద్రాక్షారామకు చెందిన దవులూరి రామకృష్ణ(డీఆర్‌కే) 83 కేజీల మాస్టర్స్ కేటగిరీలో స్టేట్ ఫస్ట్ సాధించి బంగారు పతకం, అదే కేటగిరీలో బెంచ్ ప్రెస్ విభాగంలోనూ స్టేట్ ఫస్ట్ సాధించి బంగారు పతకం సాధించారు. అదే విధంగా వెలంపాలెం గ్రామానికి చెందిన ఏపీఎస్‌పీ కానిస్టేబుల్ దొమ్మేటి నాగేశ్వరరావు 74 కేజీల మాస్టర్స్ కేటగిరీలో స్టేట్ ఫస్ట్ సాధించి బంగారు పతకం సాధించారు. తాళ్లపొలం గ్రామ సర్పంచ్ కట్టా గోవిందు కుమారుడు కట్టా వెంకటేష్(రాజా) 105 కేజీల కేటగిరీలో సీనియర్స్ విభాగంలో స్టేట్ సెకండ్ సాధించి వెండి పతకం సాధించాడు. వారిని ఎంపీ పిల్లి సుభాష్‌చంద్రబోస్, నియోజకవర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ పిల్లి సూర్యప్రకాశ్, జెడ్పీటీసీ మేర్నిడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, వైస్ ఎంపీపీలు నరాల రాజ్యలక్ష్మి, శాకా బాబీ, ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీలు ప్రత్యేకంగా అభినందించారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



కేతాని వెంకట్రావుకు ఆర్థిక సాయం అందిస్తున్న మంత్రి సుభాష్

కె.గంగవరం: అముజూరు గ్రామంలో అనారోగ్యాలతో బాధపడుతున్న ఆ కుటుంబాలను మంత్రి వాసంశెట్టి సుభాష్ పరామర్శించి ఆర్థిక సాయం అందించారు. పెరాలసిస్ పేషెంట్ కేతాని వెంకట్రావుకు రూ. 15 వేలు, ప్రమాదవశాత్తూ గాయపడి వెన్నుముక విరిగి మంచానికే పరిమితమైన కృష్ణమూర్తికి రూ.10 వేలు, క్యాన్సర్‌తో బాధ పడుతున్న పైడిమర్రి సూర్యనారాయణకు రూ. 20 వేలను ఆయా కుటుంబాలకు అందించారు. అనంతరం హెరిటేజ్ డెయిరీని పరిశీలించారు. టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



విద్యార్థులకు స్టడీ మెటీరియల్ అందజేస్తున్న వెంకటరమణ

కె.గంగవరం: మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో నవోదయ ప్రవేశ పరీక్షలకు తర్ఫీదు అయ్యే విద్యార్థులకు కాకినాడ సత్యాస్కాన్ అధినేత కాదా వెంకటరమణ ఉచితంగా స్టడీ మెటీరియల్‌ను పంపిణీ చేశారు. మండల పరిధిలోని కుందూరు ఉన్నత పాఠశాలలో మంగళవారం 70 మంది విద్యార్థులకు రూ. 20 వేల విలువ చేసే మెటీరియల్‌ను అందించారు. ఎంపీపీ పంపన నాగమణి, సర్పంచ్ పంపన సత్యానందం, హెచ్‌యం పిల్లి శ్రీనివాస్, సీనియర్ హెచ్‌యం పుల్లయ్య, దాసరి శ్రీను తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

23 వరకూ ఈ క్రాప్ నమోదు

- చివరి దశకు ఖరీఫ్ సీజన్ ఈ -క్రాప్ నమోదు
- 1,03,504 ఎకరాల్లో నమోదు లక్ష్యం
- 1,00,118 ఎకరాల నమోదుతో 96 శాతం పూర్తి



కపిలేశ్వరపురంలో ఈ- క్రాప్ నమోదు ప్రక్రియను పర్యవేక్షిస్తున్న ఏఓ రమేష్‌కుమార్

కపిలేశ్వరపురం: కోటి ఆశలతో రైతు ఖరీఫ్ సాగు చేస్తున్నాడు. సాగు ఆరంభం నుంచి గిట్టుబాటుకు ధాన్యాన్ని విక్రయించుకొనే వరకూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రైతుకు అందించే సాయం అందిపుచ్చుకునేందుకు ఈ క్రాప్ తప్పనిసరి. గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా ముందస్తు ప్రణాళికతో రైతుకు చేదోడు వాదోడుగా నిలిచింది. ఆ ప్రభుత్వం రూపొందించిన రైతు భరోసా కేంద్రాలు అందుకు వేదికలయ్యాయి. ప్రస్తుత ప్రభుత్వం అదే ఈ-క్రాప్ నిబంధనలను అమలు చేస్తున్నప్పటికీ రైతుభరోసా కేంద్రాల పేరును రైతు సేవా కేంద్రాలుగా మార్చి ముందుకు నడుస్తోంది. ఖరీఫ్ సాగు ప్రారంభమై నెలలు గడుస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన రూ.2 వేలు మినహా రైతుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి చిల్లి గవ్వ కూడా సాయమందలేదు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సాయం పొందేందుకు ప్రతి రైతూ తన సాగు భూమిని ఈ క్రాప్ చేయించుకోవాల్సిన అవసరం ఉంది. ఈ -క్రాప్ చివరి తేదీ ఈనెల 15 కాగా ఆ గడువును ఈ నెల 23 వరకూ పెంచారు. ఈ నేపథ్యంలో ఈ కథనం...

పెంచిన గడువు వివరాలివీ..

ఈ నెల 15 లోపు ఈ కేవైసీతో సహా ఈ- క్రాప్ నమోదు ప్రక్రియ పూర్తి కావాల్సి ఉండగా ఆ గడువును ఈనెల 23 వరకూ పెంచారు. రైతు సేవా కేంద్రాల్లో సోషల్ ఆడిట్ నిమిత్తం ఈ -క్రాప్ జాబితాను ప్రదర్శించాల్సిన గడువును ఈనెల 19-24ను 25-27వ తేదీకి పెంచారు. గ్రామ సభలు నిర్వహించాల్సిన గడువును 25-28 నుంచి 28-29వ తేదీ వరకూ పెంచారు. ఖరారు చేసిన జాబితాను రైతు సేవా కేంద్రాల్లో ప్రదర్శించే గడువుగా ఈనెల 30గా నిర్దేశించారు.

రెండు నియోజకవర్గాల్లో చివరి దశకు ఈ క్రాప్ నమోదు ప్రక్రియ..

మండలం	పలు పంటల సాగు (ఎకరాల్లో)	ఈ-క్రాప్ పూర్తి (ఎకరాల్లో)	శాతం	వేలి ముద్రలు వేసిన రైతులు
మండపేట	18,005	16,868	93.69	3,152
రాయవరం	14,454	14,104	97.58	3,209
కపిలేశ్వరపురం	17,541	17,043	97	5,097
రామచంద్రపురం	18,299	17,676	96.60	5,576
కాజులూరు	18,092	18,092	100	5,489
కె.గంగవరం	17,113	16,335	95.45	4,468
మొత్తం	1,03,504	1.00,118	96.72	26,991

ఉద్యాన పంటలకూ ఈ క్రాప్....


ప్రతి పంటనూ ఈ క్రాప్‌లో నమోదు చేయాలన్న అధికారుల సూచనలపై క్షేత్ర స్థాయి అధికారులు ఉద్యాన పంటల నమోదుపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచారు.

మండపేట మండలంలో 1.903, కపిలేశ్వరపురం మండలంలో 1,970, రాయవరం మండలంలో 38 మొత్తం మండపేట నియోజకవర్గంలో 3,911 ఎకరాల్లో ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. రామచంద్రపురం మండలంలో 181 ఎకరాలు, కాజులూరు మండలంలో 411 ఎకరాల్లోనూ ఉద్యాన పంటలను సాగు చేస్తున్నారు.

ఈ- క్రాప్ నేపథ్యమిదీ...

ఈ క్రాప్ నమోదును అప్పటి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రభుత్వం 2019 రబీ సీజన్‌లో తెచ్చింది. రైతు భరోసా యూనిఫైడ్ డిజిటల్ ప్లాట్‌ఫామ్ (ఆర్‌బీ అండ్ యూడీపీ) యాప్ ద్వారా వ్యవసాయ, ఉద్యాన, పట్టు, పశుగ్రాస పంటలతో పాటు సామాజిక వనాలను ఆర్‌బీకేల్లో నమోదు చేసేవారు. రెవెన్యూ, వెబ్ ల్యాండ్ డేటా ఆధారంగా క్షేత్ర స్థాయి పరిశీలనలో నిర్ధారణ అయిన అంశాలను ఆధార్ ఆధారంగా నమోదు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం నూతన విధానంలో ఈ క్రాప్‌ను నమోదు చేస్తుంది. ఈ విధానంలో మండల వ్యవసాయాధికారులు సర్వే నంబర్లను వెబ్ ల్యాండ్ నుంచి డేటాను సేకరిస్తున్నారు. సర్వే నంబర్ల ఆధారంగా రైతు సేవా కేంద్రాల్లోని వ్యవసాయ సహాయకులకు డేటాను అందజేస్తున్నారు. వ్యవసాయ సహాయకులు సర్వే నంబర్లను ఈ కర్షక్ వెబ్‌లాగిన్‌లో అప్ డేట్ చేస్తున్నారు. అనంతరం ఈ కర్షక్ మొబైల్ యాప్‌లో జియో ఫెన్సింగ్ డౌన్‌లోడ్ చేసుకుని పంట నమోదు ప్రక్రియను చేపడుతున్నారు. ఒక సర్వే నంబరుకు వెళ్ళినప్పుడు ఆసర్వే నంబర్ జియో కోఆర్డినేట్స్ ఓపెన్ అవ్వుతాయి. సర్వే నిమిత్తం వ్యవసాయ సహాయకులు క్షేత్ర స్థాయిలోని సర్వే నంబర్‌కు వెళ్తేనే యాప్ ఓపెన్ అవుతుంది.

దాదాపు ఈ క్రాప్ ప్రక్రియ పూర్తి



క్రాప్ నమోదుకు రైతు తగిన విధంగా సహకరిస్తుండడంతో దాదాపు నమోదు లక్ష్యాన్ని సాధించగలిగాం. ఉన్నతాధికారుల ఆదేశాలు, రైతు సేవా కేంద్రాల్లోని గ్రామ వ్యయసాయ సహాయకుల సమన్వయం లక్ష్య సాధనకు తోడయ్యాయి. వేలిముద్రల ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేసే దిశగా ముందుకు సాగుతున్నాం.

-కేవీఎస్ రమేష్‌కుమార్
మండల వ్యవసాయాధికారి, కపిలేశ్వరపురం

ఈ- క్రాప్ ప్రయోజనాలివీ...

ప్రతి రైతు వివరాలు, పంట విస్తీర్ణం తదితర వివరాలు ఆన్‌లైన్ అవుతాయి. ఉచిత పంటల బీమా, కనీస మద్దతు ధర, బ్యాంకుల ద్వారా సున్నా వడ్డీ రుణాలు మంజూరు, వ్యవసాయ ఉత్పత్తుల సేకరణ, ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంట నష్టం వాటిల్లితే పెట్టుబడి రాయితీ తదితర పథకాల లబ్ధిని పొందేందుకు అర్హత పొందుతారు. రైతు వేలి ముద్ర వేయగానే రైతుల వివరాలు ఆన్‌లైన్‌లో ప్రత్యక్షమవుతున్నాయి. ఈ కేవైసీ ఆధారంగా పంట కొనుగోలు ప్రక్రియ జరుగుతుంది.

ఆరోగ్యకర సమాజమే ధ్యేయంగా కృషి

- ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు
- నులిపురుగుల నివారణకు ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ



రాయవరం హైస్కూల్లో విద్యార్థులకు డీ వార్మింగ్ మాత్రలు వేస్తున్న ఎంపీపీ వెంకటరమణ తదితరులు



నేలటూరులో విద్యార్థికి మాత్ర వేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు

కపిలేశ్వరపురం: ఆరోగ్యకర సమాజ నిర్మాణమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు అన్నారు. మండలంలోని నేలటూరులో మంగళవారం నిర్వహించిన ఆల్బెండజోల్ మాత్రల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల పాల్గొన్నారు. అంగర, అచ్యుతాపురం, వాకతిప్ప పీహెచ్‌సీల పరిధిలోని గ్రామాల్లో ఆల్బెండజోల్ మాత్రలను పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో ఎంఈఓ కె.తాతారావు, ఎంపీహెచ్‌ఈఓ జిత్తుక మల్లికార్జునుడు, సీహెచ్ గోపాలకృష్ణ, హెచ్‌ఈ బి.రామారావు, ఎంపీహెచ్‌ఎస్ కామేశ్వరరావు మాట్లాడుతూ మండలంలోని మూడు పీహెచ్‌సీల పరిధిలో 131 సంస్థల్లోని 8,595 మంది చిన్నారులకు మాత్రలను పంపిణీ చేసే లక్ష్యంతో కృషి చేస్తున్నామన్నారు. మాత్రలను మంగళవారం వేసుకోని వారికి ఈ నెల 25న మరో ప్రత్యేక కార్యక్రమం ద్వారా అందజేస్తామని పీహెచ్‌సీల అధికారులు తెలిపారు.

రాయవరం: స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణతో కలిసి విద్యార్థులకు డీవార్మింగ్ మాత్రల పంపిణీని ప్రారంభించారు. పీహెచ్‌సీ వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో డీవార్మింగ్ మాత్రల పంపిణీ చేపట్టారు. మండలంలో రాయవరం, మాచవరం పీహెచ్‌సీల పరిధిలో 8,648 మందితో డీవార్మింగ్ మాత్రలు మింగించడం లక్ష్యమని వైద్య సిబ్బంది తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి, హెచ్‌ఎం వీఎస్ సునీత, పంచాయతీ విస్తరణాధికారి ఎం.శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. మండలంలోని పాఠశాలల్లో నిర్వహించిన కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, ఎస్ఎంసీ చైర్మన్లు పాల్గొన్నారు.

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెల్ల, ద్రాక్షారామ పీహెచ్‌సీల పరిధిలో ఒకటి నుంచి 19ఏళ్ల వయస్సు గల పిల్లలకు మంగళవారం ఆల్బెండజోల్ మాత్రలు వేశారు. వెల్ల పీహెచ్‌సీ పరిధిలోని వెల్ల జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో మండల ఎంపీపీ, పీహెచ్‌సీల అభివృద్ధి కమిటీల చైర్‌పర్సన్ అంబటి భవాని ముఖ్య అతిథిగా పాల్గొని చిన్నారులతో మాత్రలను మింగించారు. ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ డివిజనల్ సూపర్‌వైజర్ జి.కమల్ శేషు వివరాలను వెల్లడించారు. వెల్ల పీహెచ్‌సీ పరిధిలో 31 అంగన్‌వాడీ కేంద్రాలు, 25 పాఠశాలలు, ఒక కళాశాల పరిధిలో 2,739 మంది చిన్నారులు ఉండగా 2,629 మందికి, ద్రాక్షారామ పీహెచ్‌సీ పరిధిలో 42 అంగన్‌వాడీ కేంద్రాలు, 3 పాఠశాలలు, 4 కళాశాలల్లో 7,813 మంది చిన్నారులు ఉండగా 7,486 మందికి మాత్రలు వైద్య సిబ్బంది అందించారు. మిగిలిన వారికి ఈ నెల 25 న నిర్వహించే కార్యక్రమంలో అందజేస్తామన్నారు. వెల్లలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వీరబోయిన సూరిబాబు, ఎంపీటీసీలు చిక్కాల స్వామికావు, మంచెం దేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బి.వీరభద్రరాజు, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ద్రాక్షారామ జెడ్పీ హైస్కూలును సందర్శించిన డీవైఈఓ..

ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్‌లో జరిగిన డీవార్మింగ్ కార్యక్రమాన్ని జిల్లా ఉప విద్యా శాఖాధికారి ఎస్ఎల్ నరసింహ ఫణి పరిశీలించారు. నులి పురుగుల నివారణ ఆవశ్యకతను గురించి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులకు ఆల్బెండజోల్ మాత్రలు మింగించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయిని రత్న పద్మావతి, ఏఎస్ఎం ధనలక్ష్మి, వైద్య సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



వెల్ల జెడ్పీ హైస్కూల్‌లో విద్యార్థులకు మాత్రలు మింగిస్తున్న ఎంపీపీ భవాని



ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్లో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీవైఈఓ నరసింహ ఫణి

గణనాథుని మంటపాల్లో అన్నదానాలు

మండపేట గూడ్స్ ఆటో యూనియన్,కేశవరం భక్తాంజనేయ గణపతి ఆధ్వర్యంలో..

మండపేట: గణపతి నవరాత్ర ఉత్సవాల ముగింపు సందర్భంగా ఉత్సవాల నిర్వాహకులు భారీఎత్తున అన్నదానాలు చేస్తున్నారు. స్థానిక ఏడిద రోడ్డులోని ఆటో యూనియన్ సభ్యులు మంగళవారం అన్నదానం చేశారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన మున్సిపల్ చైర్ పర్సన్ పతివాడ దుర్గారాణి భక్తులకు అన్న ప్రసాదాన్ని వడ్డించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. పరిసర ప్రాంతాల నుంచి భారీ ఎత్తున భక్తులు తరలి వచ్చి అన్నప్రసాదాన్ని స్వీకరించారు. కార్యక్రమంలో 16వ వార్డు కౌన్సిలర్, యూనియన్ ప్రెసిడెంట్ మెండు బాపిరాజు, కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, నీలం దుర్గమ్మ, యూనియన్ సభ్యుడు లంక జాన్ పాల్గొన్నారు.

అలాగే మండలంలోని కేశవరం గ్రామంలోని శ్రీభక్తాంజనేయ వినాయకుని ఆలయం వద్ద ప్రతిష్ఠించిన గణనాథుని విగ్రహాన్ని సోమవారం నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్వామి వారి అన్న ప్రసాద వితరణ జరిగింది. ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ముఖ్య అతిథిగా విచ్చేసి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆయన తొలుత ఆంజనేయ స్వామిని, వినాకుడిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ వుండమట్ల శ్రీనివాస్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు, ఎంపీటీసీ సభ్యుడు అన్నందేవుల కృష్ణారావు, ఆ పార్టీ నాయకులు ముక్కపాటి శ్రీనివాస్, కొప్పిరెడ్డి ప్రసాద్, సలాది శివ, పెదపాటి ఉమామహేశ్వరరావు, బందెల సాయిరాం పాల్గొన్నారు.

జ్ఞాన కేంద్రాలుగా స్కూల్ కాంప్లెక్స్‌లు



పసలపూడిలో నిర్వహిస్తున్న స్కూల్ కాంప్లెక్స్ సమావేశం

రాయవరం: స్కూల్ కాంప్లెక్స్ సమావేశాల్లో ఉపాధ్యాయులు తమ అనుభవాలను ఇతరులకు పంచేలా ఉండాలని ఎంఈఓలు పి.రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ అన్నారు. స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాలలో మంగళవారం నిర్వహించిన బయాలజీ సబ్జెక్టు ఉపాధ్యాయుల, పసలపూడి, వెంటూరు ఉన్నత పాఠశాలల్లో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశాలను ఎంఈఓలు సందర్శించారు. అనంతరం ఉపాధ్యాయులను ఉద్దేశించి మాట్లాడారు. స్కూల్ కాంప్లెక్స్ సమావేశాలను జ్ఞాన సముపార్జన కేంద్రాలుగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గత సమావేశాలకు భిన్నంగా లైవ్ సెషన్స్ ఆన్‌లైన్‌లో ప్రసారం చేస్తున్నట్టు తెలిపారు. లైవ్ సెషన్స్‌ను ప్రతి ఉపాధ్యాయుడూ సద్వినియోగం చేసుకుని, బోధనా సామర్థ్యాలను మెరుగుపరుచుకోవాలని సూచించారు. పాఠశాలల్లో బోధనా సమయంలో టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్‌ను వినియోగించాలని, టీఎల్‌ఎంతో తరగతి గదిని ఆకర్షణీయంగా తీర్చిదిద్దాలని సూచించారు. మారుతున్న కాలానుగుణంగా బోధనా పద్ధతులను మార్చుకుంటేనే ఉపాధ్యాయుడు సమర్థవంతంగా బోధన చేయగలరన్నారు. సమావేశంలో కాంప్లెక్స్ హెచ్‌ఎంలు సునీత, ఆదినారాయణ, సత్తిరాజు, కాంప్లెక్స్ సెక్రటరీలు పాల్గొన్నారు.

జాతీయ స్థాయికి పోటీలకు ఎంపికైన సైన్స్ ప్రాజెక్టులు



జాతీయస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో గైడ్ టీచర్ ఉమాశ్రీవాణి, హెచ్‌ఎం కేకేఎల్ కుమారి

రామచంద్రపురం రూరల్: నరసాపురపుపేట జెడ్పీ హైస్కూల్ విద్యార్థుల సైన్స్ ప్రాజెక్టులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయిని కేకేఎల్ కుమారి మంగళవారం విలేకరులకు తెలిపారు. సూరంపాలెం ఆదిత్య యూనివర్సిటీలో ఇటీవల నిర్వహించిన భారత్ టెక్ లీగ్-2024 పేరుతో 3డీ ప్రింటింగ్, క్లీన్ ఎనర్జీ, డ్రోన్, రోబోటిక్స్ విభాగాల్లో నిర్వహించిన సైన్స్ ప్రాజెక్టు పోటీల్లో తమ పాఠశాల విద్యార్థులు రెండు టీంలుగా క్లీన్ ఎనర్జీ అనే అంశంపై ప్రాజెక్టు చేయగా ఈ రెండు ప్రాజెక్టులూ జాతీయ స్థాయికి ఎంపికైనట్టు నిర్వాహకులు మంగళవారం తెలిపారు. ఈసందర్భంగా విద్యార్థులను శిక్షణ ఇచ్చిన గైడ్ టీచర్ జి.ఉమాశ్రీవాణిని, విద్యార్థులు ఎస్.స్రవంతి, సీహెచ్ సుమశ్రీ, ఎం.హేమశ్రీ, పి.బాలాజీ, ఎంఎన్‌వీవీ సాయిలను ప్రత్యేకంగా అభినందించారు. వారిని గ్రామ సర్పంచ్ చాట్రాది వీరలక్ష్మి, ఎంపీటీసీ పడమటి జ్ఞానలక్ష్మి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్‌పర్సన్ పి.కృష్ణవేణి, వైస్ చైర్మన్ పి.శ్రీనివాస్, ఉపాధ్యాయులు సీహెచ్‌వీ మల్లీశ్వరి, పి.రవికుమార్ తదితరులు అభినందించారు.

ఘనంగా ప్రధాని మోదీ పుట్టినరోజు వేడుకలు



ద్రాక్షారామలో కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న బీజేపీ నాయకులు

రామచంద్రపురం రూరల్: దేశ ప్రధాని నరేంద్ర మోదీ పుట్టిన రోజు వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో మంగళవారం ద్రాక్షారామలో ఘనంగా నిర్వహించారు. ద్రాక్షారామ బోసు బొమ్మ సెంటర్‌లో ప్రధాన మోదీ కటౌట్‌ను ఏర్పాటు చేసి అక్కడ కేక్ కట్ చేసి పంచి పెట్టుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీనియర్ నేత కర్రి చిట్టిబాబు హాజరై మాట్లాడారు.

మోదీ నాయకత్వంలోనే దేశం పురోగతి

కాజులూరు: భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోనే దేశం పురోగతి సాధిస్తుందని రామచంద్రపురం బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ దూడల శంకర్‌నారాయణ అన్నారు. నరేంద్రమోదీ 74వ పుట్టిన రోజును మంగళవారం ఘనంగా నిర్వహించారు. పార్టీ మండల శాఖ అధ్యక్షుడు సలాది వీరబాబు ఆధ్వర్యంలో పలు గ్రామాలలో కార్యకర్తలు మొక్కలు నాటే కార్యక్రమాలు చేపట్టారు. పెనుమళ్ళలో పాఠశాల విద్యార్థులు, కూటమి నాయకులు స్వచ్ఛత ఈ సేవా కార్యక్రమంపై ర్యాలీ చేసి ప్రజలకు అవగాహన కల్పించారు.

పరిశుభ్రత- పచ్చదనం లక్ష్యం కావాలి



మండపేటలో రోడ్లను శుభ్రం చేస్తున్న ఎమ్మెల్యే వేగుళ్ల, చైర్ పర్సన్ దుర్గారాణి



అంగర చప్పిడిపాలెం సెంటర్‌లో మానవహారంగా నినాదాలు చేస్తున్న ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు



మారేడుబాకలో ర్యాలీ చేస్తున్న విద్యార్థులు



రాయవరంలో నిర్వహిస్తున్న స్వచ్ఛతాహి ర్యాలీ

- ఎమ్మెల్యే జోగేశ్వరరావు
- మండపేటలో స్వచ్ఛత హీ సేవ ప్రారంభం

మండపేట: పరిశుభ్రత – పచ్చదనం లక్ష్యంగా మండపేటను రాష్ట్రంలోనే నంబర్ వన్ పట్టణంగా తీర్చిదిద్దాలని ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సూచించారు. ప్రధాని మోదీ శ్రీకారం చుట్టిన స్వచ్ఛత హీ సేవలో భాగంగా స్వభావ్ స్వచ్ఛత, సంస్కారం స్వచ్ఛత పేరిట మంగళవారం మండపేట మున్సిపాలిటీ స్వచ్ఛభారత్ కార్యక్రమం ప్రారంభించింది. మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వేగుళ్ల ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పారిశుధ్య కార్మికులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, విద్యార్థులు, డ్వాక్రా మహిళలు, ఉపాధ్యాయులు మెయిన్‌రోడ్డును కొంత సేపు శుభ్రం చేశారు. అనంతరం పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. కలువపువ్వు సెంటర్ నుంచి ర్యాలీ ప్రారంభమైంది. ప్లాస్టిక్ సంచులు వద్దు- గుడ్డ సంచులు ముద్దు, జీరో వేస్ట్‌కు కృషిచేద్దాం, నూరుశాతం ఆరోగ్యాన్ని సాధిద్దాం, మొక్కలు నాటండి పర్యావరణాన్ని రక్షించండి అంటూ ఈ సందర్భంగా వారు నినాదాలు చేశారు. తొలుత కలువ పువ్వు సెంటర్ చుట్టూ మానవహారంగా ఏర్పడి ప్రతిజ్ఞ చేశారు. టౌన్ ఎస్ఐ హరికోటి శాస్త్రి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ కమిషనర్ టి. కనకరాజు, కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, నీలం దుర్గమ్మ, ఎర్నేని ప్రభావతి సత్యం, చిట్టూరి సతీష్, గ్రంధి శ్రీనివాస్, పిల్లి గనేశ్వరరావు, రోటరీ క్లబ్ అధ్యక్షుడు ఇమ్మిడిశెట్టి నాగభూషణం, టీడీపీ నాయకులు పెందుర్తి ప్రదీప్ కుమార్, శెట్టి రవికుమార్, చింతల శ్రీనివాస్, కొవ్వాడ అప్పన్నబాబు, వాదా ప్రసాదరావు, కట్టుమేను చిన్ని, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

స్వచ్ఛతా హి సేవపై అవగాహన

కపిలేశ్వరపురం: పరిశుభ్రమైన జీవన విధానానికి ప్రతి ఒక్కరూ అలవాటు పడాలని కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో పాల్గొన్న వక్తలన్నారు. గ్రామాల్లో పారిశుధ్యాన్ని మెరుగు పరిచే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా మంగళవారం మండలంలోని 19 గ్రామాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. మహాత్మాగాంధీ జయంతి రోజైన అక్టోబర్ 2 వరకూ పలు దఫాలుగా ఈ కార్యక్రమాలను కొనసాగించనున్నారు. తొలి రోజైన మంగళవారం గ్రామాల్లో అవగాహన గ్రామసభలు నిర్వహించారు. గ్రామాలను పరిశుభ్రంగా ఉంచుతామంటూ ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు. ఎంపీడీఓ కొండలరావు పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమాల్లో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఉప సర్పంచులు, సచివాలయ ఉద్యోగులు మాట్లాడారు. శ్రమదానంతో ప్రజలు పారిశుధ్య పనులు చేపట్టడం, సేకరించిన చెత్తను తడి చెత్త, పొడి చెత్తగా వేరు చేయడం, సేంద్రియ ఎరువు తయారీ వంటి కార్యక్రమాలను చిత్తశుద్ధితో చేపడతామన్నారు. అంగర, పడమరఖండ్రిక, తాతపూడి, అద్దంకివారిలంక, కేదారిలంక, వాకతిప్ప, నాగుల చెరువు, మాచర, కోరుమిల్లి, టేకి, కాలేరు, నల్లూరు, అచ్యుతాపురం, వడ్లమూరు, నిడసనమెట్ట, కపిలేశ్వరపురం, వల్లూరు, నేలటూరు తదితర గ్రామాల్లో మానవహారాన్ని నిర్వహించారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

మండపేట: స్వచ్ఛత హీ సేవలో భాగంగా మారేడుబాకలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థినీవిద్యార్థులు, అధ్యాపకులు మంగళవారం కళాశాల పరిసరాలను శుభ్రపరిచారు. కాలేజీ ప్రిన్సిపాల్ టీకేవీ శ్రీనివాస్, ఎన్ఎస్ఎస్ కో-ఆర్డినేటర్ డాక్టర్ జె. నెహ్రూనాయక్ ఆధ్వర్యంలో విద్యార్థులు కాలేజీ ఆవరణలో పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి, ఆవరణను శుభ్ర పరిచారు.అంతకు ముందు విద్యార్థులు, అధ్యాపకులు స్వచ్ఛత హీ సేవపై గ్రామస్తులకు వివరిస్తూ అవగాహనా ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ఈ. ఆనందరావు, ఎన్‌సీసీ కో -కన్వీనర్ సీహెచ్ దిలీప్‌కుమార్, ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలి

రాయవరం: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిశుభ్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద మంగళవారం స్వచ్ఛతాహి సేవ ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు, ఉద్యోగులతో నిర్వహించిన ర్యాలీని ఉద్దేశించి వెంకటరమణ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇచ్చిన పిలుపు మేరకు వచ్చే నెల 2వ తేదీ వరకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకునేందుకు పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు తొలుత ర్యాలీ నిర్వహించాక, మానవహారంగా ఏర్పడ్డారు. ఇదేవిధంగా మండలంలో ఆయా గ్రామాల్లో స్వచ్ఛతాహి సేవా ర్యాలీలు నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, స్థానిక నేత వుండవిల్లి రాంబాబు, తాడి రామచంద్రారెడ్డి, ఎంపీడీవో కొవ్వూరి నరేంద్రరెడ్డి, పంచాయతీ విస్తరణాధికారి ఎం.శ్రీనివాసరావు, యానిమేటర్ల సంఘం అధ్యక్షురాలు ఎం.శ్రీదేవి పాల్గొన్నారు.

మున్సిపల్ కమిషనర్‌గా రంగారావు



మండపేట: మండపేట మున్సిపల్ కమిషనర్‌గా టీవీ రంగారావు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఇక్కడ కమిషనర్‌గా పనిచేసిన బి.రాము విశాఖ జిల్లాకు బదిలీ అయిన విషయం తెలిసిందే. కాగా రంగారావు గతంలో మండపేట కమిషనర్‌గా కొంతకాలం పనిచేశారు. నూతన కమిషనర్‌కు మున్సిపల్ మేనేజర్ టి.కనకరాజు, ఆర్‌వో శాస్త్రి, ఆర్ఐ అందే శ్రీనివాస్, పలు విభాగాల సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందించి, స్వాగతం పలికారు.